ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 6 జూన్ 2025





మొక్క నాటుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

సర్వం సిద్ధం

- నేటి నుంచి మెగా డీఎస్సీ పరీక్షలు
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 18,001 మంది అభ్యర్థులు
- మహిళలే అధికం
- మొత్తం దరఖాస్తులు 34,629

సాలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోటీ పడుతున్న 18001 మంది అభ్యర్థులు శుక్రవారం నుంచి గ్రూపుల వారీగా పరీక్షలకు హాజరుకానున్నారు. ఈనెల 30 వరకు సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో పరీక్షలు జరుగుతాయి. ఆన్‌లైన్ పరీక్ష కావడం, ఎక్కువ మంది అభ్యర్థులు ఉండడంతో ఉదయం కొందరికి, మధ్యాహ్నం కొందరికి పరీక్ష నిర్వహించేందుకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా 583 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ ఖాళీలే కాకుండా డిఫరెంట్ ఏబుల్డ్ పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్త యూనిట్‌గా చూపించిన 2,259 టీచర్ పోస్టుల్లో జోన్ ఒకటికి 400 కేటాయించారు. రాష్ట్రం యూనిట్‌గా భర్తీ చేయనున్న మరో 259 టీచర్ పోస్టులకు సైతం ఉమ్మడి జిల్లాలో ఉన్న నిరుద్యోగ ఉపాధ్యాయులు పోటీ పడవచ్చు. జిల్లా నుంచి 18001 మంది వివిధ పోస్టులకు 34,629 దరఖాస్తులందించారు. మహిళ అభ్యర్థులే అధికంగా ఉన్నారు. మహిళలు 10,225 మంది కాగా పురుష అభ్యర్థులు



7776 మంది డీఎస్సీకి హాజరవుతున్నారు. డీఎస్సీలో పలువురు ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నందున వారికి వెసులుబాటు ఉండేలా పరీక్ష తేదీల్లో మార్పులు చేశారు. టీజీటీలు, పీజీటీలు, ఎస్జీటీలు,

పోస్టుల వారీగా హాజరుకానున్న అభ్యర్థులు

పోస్టు	మొదటి సెషన్	రెండో సెషన్	మొత్తం
ఎస్జీటీ	4852	2319	7171
ఎస్ఏ తెలుగు	940	47	987
ఎస్ఏ గణితం	253	1390	1643
ఎస్ఏ ఫిజిక్స్	1392	1391	2783
ఎస్ఏ బయోలజీ	436	1390	1826
ఎస్ఏ సోషల్	1880	941	2821
పీఈటీ	1414	-	1414
ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)	150	1391	1541
ఇంగ్లీష్ ప్రొఫిసియన్సీ	1964	700	2664
పీజీటీ అండ్ టీజీటీ	2648	9125	11773

ప్రిన్సిపాల్స్ ఇలా వివిధ కేటగిరీలకు వివిధ తేదీలను కేటాయించారు. టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్స్‌కు ఆంగ్ల భాష నైపుణ్య పరీక్ష ఈ నెల 23,24 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు విడతలుగా నిర్వహించనున్నారు. ప్రిన్సిపాల్స్, పీజీటీ, పీడీ పోస్టులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మూడు గంటల పాటు పరీక్ష నిర్వహించనున్నారు.

- అభ్యర్థులు ఐదు కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు. విజయనగరంలోని సీతం కాలేజీ, ఐయాన్ డిజిట్ జోన్, లెండి ఇంజినీరింగ్, ఎంవీజీఆర్, అవంతి కళాశాలల్లో (మిగతా 8వ పేజీలో)

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కరరావు

పార్వతీపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం డీఈఐసీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతతోనే సకల జీవరాశుల మనుగడ సాధ్యమని తెలిపారు. కానీ, కాలుష్యం, విపరీతమైన ప్లాస్టిక్ వినియోగంతో సమతుల్యత దెబ్బతింటుందన్నారు. దీంతో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్ తదితర అనారోగ్య సమస్యల బారినపడుతున్నారని అన్నారు. అందరూ భాగస్వాములై పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే జీవనశైలిని ప్రతి ఒక్కరూ అవలంబించాలని సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, డీపీఎంవో డాక్టర్ పీఎల్ రఘుకుమార్, వైద్యులు భరత్‌చంద్ర, లలితదుర్గ, ఫిజియోథెర పిస్టు లక్ష్మీనారాయణ, సీసీ శ్రీనివాసరావు, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ మాంసం తిన్నారో.. అంతే!

- సాలూరులో కుళ్లిన, నిల్వ ఉన్నవి విక్రయం
- మాంసం, చేపల అమ్మకాలపై కానరాని నిఘా
- బరితెగిస్తున్న కొంతమంది వ్యాపారులు
- ప్రజారోగ్యంతో చెలగాటం
- ఇటీవల అధికారుల దాడుల్లో బయటపడిన వైనం
- వినియోగంలోకిరాని శ్లాటర్ హౌజ్

సాలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపాలిటీలో మటన్, చికెన్‌తో పాటు చేపల అమ్మకాలపై అధికారుల నిఘా కొరవడింది. దీంతో కొంతమంది వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కుళ్లిన, నిల్వ ఉన్న మాంసం, చేపలను అపరిశుభ్ర పరిసరాల్లో విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాట మాడుతున్నారు. పలు కారణాలతో చనిపోయిన పొట్టేళ్లు, కోడి మాంసాన్ని కూడా కొనుగోలుదారులకు అంటగడుతున్నారు. తాజా మాంసంలో నిల్వ ఉన్న మాంసాన్ని కలిపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. మరికొందరు తూనికల్లో మోసాలకు పాల్పడుతూ కొనుగోలుదారులకు జెల్లకొడుతున్నారు. అయితే వాటి అమ్మకాలపై మున్సిపల్ అధికారుల తనిఖీలు కరువయ్యాయి. దీంతో ప్రజలకు తాజా మాంసం, చేపలు లభ్యం కావడం లేదు. వాటిని పరిశీలించి కొనుగోలు చేయడం ఉత్తమమని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. లేకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

సాలూరులో మున్సిపాల్టీలో మాంసం, చేపల విక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఆది, మంగళ, బుధవారాల్లో ఆ సందడే వేరు. కొనుగోలుదారులతో మార్కెట్ కళకళ డుతుంది. నెలకు సుమారు రూ.కోటి వరకు వ్యాపారం జరుగుతుందని అంచనా. అయితే డిమాండ్ దృష్ట్యా కొంతమంది వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని ఖాతరు చేయడం లేదు. నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు.


మున్సిపాలిటీ శ్లాటర్ హౌజ్ ఇలా..

సాలూరు ముత్తరాసువీధి సమీపంలో వేగావతి నది తీరంలో 2013లో శ్లాటర్ హౌజ్‌ను ప్రారంభించారు. అయితే 12 ఏళ్లు గడుస్తున్న ఇప్పటికీ అక్కడ ఒక్క పొట్టేళ్లను (మిగతా 8వ పేజీలో)





చికెన్ దుకాణాలను తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఫైల్)



సింగిడి రిజర్వాయర్‌కు గేట్లు లేని దృశ్యం

తాగునీటి వనరులున్నా.. ఉపయోగం సున్నా

- ముందుకు సాగని పనులు
- రైతులకు అందని సాగునీరు
- ఈ ఏడాది కూడా మారని పరిస్థితి

భామిని, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భామిని మండలంలో నీటి వనరులకు కొదవ లేదు. సింగిడి బ్యాలెన్సింగ్, భామిని కొండలోయగెడ్డ వంటి రిజర్వాయర్లు ఉన్నాయి. కానీ, వాటివల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండడం లేదు. పనులు పూర్తికాకపోవడంతో సాగునీరు అందడం లేదు. వడ్డంగి, మనుమకొండ ఎత్తిపోతల పథకాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. దీంతో ఏటా వర్షాల కోసం రైతుల ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ సర్కారు ఈ పనులపై తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా ఆ జోలికి వెళ్లడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు వంశధార ప్రాజెక్టు జీవనాడి. ఈ ప్రాజెక్టు విస్తరణలో భాగంగా వంశధార వరద నీటిని సద్వినియోగం చేసుకునేందుకు 2005లో ఫేజ్-2, స్టేజ్-2 పేరిట రూ.వెయ్యి కోట్లతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు చేపట్టింది. ఈ ప్రాజెక్టు విలువ ప్రస్తుతం రూ2,400 కోట్లుకు పెరిగింది. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరేళ్లుగా పట్టించుకో కపోవడంతో అవి పూర్తి కావడం లేదు. దీనికి తోడు కాట్రగడ ఓపెన్‌హెడ్ చానల్ వద్ద వరద కాలువకు ముందు మట్టి, ఇసుక పేరుకుపోయింది. వాటిని తొలగించే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. మిగిలిన వరద కాలువ పనులు పూర్తి చేసే దాత లేరు. సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పూర్తికాకపోవడంతో పాటు దీనికి సేకరించిన భూములకు సంబంధించి రైతులకు ఏళ్ల తరబడి పరిహారం అందివ్వడం లేదు. కాట్రగడ నుంచి కొరమ వరకు 20 కిలోమీటర్ల వరదకాలువ నిర్మించారు. దీంతో ఈ కాలువ గర్భంలో వివిధ గెడ్డలు, వాగులు, చెరువులు కలిసిపోయాయి. దీనివల్ల రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం (మిగతా 8వ పేజీలో)

ఐదు లక్షల

మొక్కలు నాటడమే లక్ష్యం

- స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరం
- యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పైనాపిల్ సాగుచేస్తున్న రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సీతంపేట రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సీతంపేట ఏజెన్సీలో ఆయన పర్యటించారు. వనం-మన్యం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలిసి తురాయిపువలస ఉద్యానవన నర్సరీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వనం-మనం కార్యక్రమాన్ని ఏదో ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, సొంత కార్యక్రమంలా నిర్వహించాలని సూచించారు. దీనికి స్థానిక స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరమని అన్నారు. ఇంటి ఆవరణ, బయట, బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాతావరణ సమతుల్యతలో మార్పులు తీసుకురావాలని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. నిషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల నివారణపై వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు.

యువతకు ఉపాధి అవకాశాలు..

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సీతంపేట ఐటీఐ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో స్కిల్‌హబ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం శాంప్లింగ్ టైలర్ కోర్సులను ప్రారంభించినట్లు చెప్పారు. ఇందులో శిక్షణ తీసుకుంటున్న 30మంది అభ్యర్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి ముందు హడ్డుబంగి, మెట్టుగూడ, మొగదార గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాలను పరిశీలించారు. బిల్లగూడలో (మిగతా 8వ పేజీలో)



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

6 లో

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- సీతంపేటలో 'యోగాంధ్ర'
- పెద్ద సంఖ్యలో హాజరైన యువత, మహిళలు, ఉద్యోగులు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

- ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ



మాట్లాడుతున్న పీవో శ్రీవాత్సవ

పార్వతీపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని పీవో అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. గురువారం గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య మోడల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, వసతిగృహ సంక్షేమాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు డ్రైవ్ కార్యక్రమం చేపట్టాలని అన్నారు. పాఠశాలల ప్రాంగణాలు శుభ్రపర్చడం, తరగతి గదుల నిర్వహణ, చిన్నపాటి మరమ్మతులు చేపట్టడం, అన్ని ఐటీ పరికరాలు సరిగ్గా పనిచేసేలా చూసుకోవడం, నీటి ట్యాంక్‌లను శుభ్రపర్చడం మొదలైన వాటికి (మిగతా 8వ పేజీలో)

'తోటపల్లి'కి నిధుల మంజూరుకు కృషి

- కేంద్ర జల శక్తి అభియాన్ ప్రతినిధి తరుణ్ దోలియా

గరుగుబిల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అవసరమైన నిధుల సమీకరణకు ప్రత్యేక కృషి చేస్తానని కేంద్ర జల శక్తి అభియాన్ ప్రతినిధి తరుణ్ దోలియా అన్నారు. గురువారం తోటపల్లి ప్రాజెక్టుతో పాటు కుడి ప్రధాన కాలువ, స్పిల్‌వే ప్రాంతాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, అవసరమైన నీటి వనరుల కల్పనకు కేంద్రం గతంలో ఏఐబీపీ నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఏ మేరకు అభివృద్ధి పనులు నిర్వహించారన్న దానిపై క్షేత్ర స్థాయిలో పరిశీలనకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. గతంలో ప్రాజెక్టుకు సంబంధించి పీఎంకేఎస్‌వై పథకంలో భాగంగా రూ. 99కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఏఐబీపీ నిధులతో చేపట్టిన పనుల వివరాలను ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు, డీఈ టి.రఘునాథనాయుడు కేంద్ర బృందానికి వివరించారు. వివిధ పనుల కోసం రూ.105 కోట్లుకు పైగా వ్యయం చేశామని, అయితే రూ. 99కోట్లు నిధులు విడుదలయ్యాయని చెప్పారు. మరో రూ.6 కోట్లు రావాల్సి ఉందని వివరించారు. ప్రాజెక్టుకు ఏ ప్రాంతం నుంచి నీరు వస్తుంది, ఎంత మేర నీటి నిల్వ సామర్థ్యం, ఎన్ని వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది వంటి విషయాలను కేంద్ర బృందం తెలుసుకుంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ నిఖిల్ జెఫ్, శాస్త్రవేత్త డి.అనంతరావు, జి.శ్రీనివాసరావు, డీఈ గోవిందరావు, జేఈలు శ్రీనివాసరావు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.



తోటపల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఎస్సీ యువత నైపుణ్యానికి తగ్గట్టు ఉపాధి

- ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేస్తాం
- మాల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్

6 లో

ఫిర్యాదులపై సీడీఎంఏకు నివేదిక

- మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ రవీంద్ర
- పార్వతీపురం కమిషనర్ వెంకటేశ్వర్లుపై విచారణ

8 లో

వేటకు సన్నాహాలు

- 14 అర్ధరాత్రితో ముగియనున్న నిషేధం
- వలలు, పడవలను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

7 లో

శుభకార్యానికి వచ్చి అనంత లోకాలకు..

- బావిలో స్నానానికి దిగి విద్యార్థి మృతి

7 లో

ఆల్ ది బెస్ట్ అభ్యర్థులూ!

- పూర్తి సాధనతోనే ఉపాధ్యాయ కొలువు
- ప్రణాళికలతో సాధించడం సులువు
- నేటి నుంచి ఐదుకేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న డీఎస్సీ అభ్యర్థులు

విజయనగరం కలెక్టరేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీకి పోటీ భారీ స్థాయిలో ఉంది. అభ్యర్థులు ప్రణాళికతో సన్నద్ధమైతే అవకాశాన్ని చేజిక్కించుకోవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 583 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు టెట్ వెయిటేజ్ 20శాతం ఉంటుంది. డీఎస్సీ పరీక్షను 160 ప్రశ్నలతో 80 మార్కులకు కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుంచి ఈనెల 30 వరకు జిల్లాలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. సైకాలజీ, జనరల్ నాలెడ్జ్, మెథడాలజీపై దృష్టి సారిస్తే విజయం సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. వారేం చెబుతున్నారంటే..

మనో విజ్ఞానమే ధైర్యం

విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం (సైకాలజీ)ను మనో ధైర్యంతో రాయాల్సి ఉంటుంది. టీజీటీ, పీజీటీలకు వారికి తరగతి గది అనువర్తనాల పేరుతో పదిప్రశ్నలు ఇచ్చి ఐదు మార్కులు కేటాయిస్తారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లకు విద్యామనోవిజ్ఞానశాస్త్రం పేరుతో 10 మార్కులకు 20 ప్రశ్నలు ఇస్తారు.

- ప్రశ్నను ఒకటికి రెండుసార్లు చదివాకే జవాబు ఎంపిక చేసుకోవాలి.
- పాఠశాల సహాయకులకు, టీజీటీలకు వైయుక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వం.. ఎస్జీటీ, పీజీటీ వారికి వైయుక్తిక భేదాలు, అభ్యసన, మూర్తిమత్వంతో పాటు పెరుగుదల వికాసం చాప్టర్ చదవాల్సి ఉంటుంది. ప్రజ్ఞపై కూడా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది.
- సైకాలజీలో రెండో చాప్టర్‌లో వచ్చే అభ్యసనానికి సంబంధించి తరగతి గదిలో అంశాలను అన్వయిస్తూ లోతుగా చదవాల్సి ఉంటుంది.
- మూర్తిమత్వాన్ని సులువైన చాప్టర్‌గా పరిగణించినా ఇందులోనే ఎక్కువ తప్పులు చేస్తుంటారు. జాగ్రత్తగా సమాధానాలు రాయాలి.
- పెరుగుదల వికాసం, చాప్టర్ ఎస్జీటీ, పీజీటీ రాసే వారికి మాత్రమే ఉంటుంది. ఈ చాప్టర్‌లో పెరుగుదల వికాసం-సూత్రాలు, వికాశ దశలు, వికాస సిద్ధాంతాలు ప్రత్యేకంగా చదవాలి.
- బీఎడ్ మనో విజ్ఞానశాస్త్ర తెలుగు పుస్తకాలు, డీఎడ్ విద్యామనోవిజ్ఞాన శాస్త్ర తెలుగు అకాడమీ చదవాలి. గత ప్రశ్నపత్రాలను కచ్చితంగా పరిశీలించుకోవాలి.

మెథడాలజీ సబ్జెక్టులు కీలకమే

స్కూల్ అసిస్టెంట్ పరీక్షలు రాసే అభ్యర్థులు ఇంటర్ స్థాయి వరకు ఆయా సబ్జెక్టులపై పట్టుసాధించాల్సి ఉంటుంది. అలాగే మెథడాలజీలో బోధన పద్ధతులు, టీఎల్ఎం తదితర అంశాలపై పట్టుసాధించాల్సి ఉంటుంది. ఎస్జీటీ అభ్యర్థులతే పదోతరగతి స్థాయి వరకు అన్నీ సబ్జెక్టులపై పట్టు ఉండాలి. గణితం, సైన్సు, సోషల్ మెథడాలజీపై పట్టుసాధించాలి. మెథడాలజీలో సబ్జెక్టులో బోధన పద్ధతులు మారుతూ ఉంటాయి. వాటిని అవగాహన చేసుకోవాలి.

వర్తమాన అంశాలే మూలం

- జనరల్ నాలెడ్జిలో 20 ప్రశ్నలు అడిగితే 10 మార్కులు ఉంటాయి. కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం పెంచారు. జనరల్ నాలెడ్జిలో వర్తమాన అంశాలతో ముడిపడి ఉన్న ప్రశ్నలు అధికంగా వస్తాయి.
- తాజాగా ఆన్‌లైన్ పరీక్ష ఉండటంతో పరీక్ష తేదీకి రెండు రోజుల ముందువరకు దినపత్రికలు చదవడం మంచిది.
- కరెంట్ అఫైర్స్ కోసం గత ఆరునెలల సమాచారం, సమగ్రంగా, ఏడాది క్రితం వరకు అంశాలను విహంగ వీక్షణ పద్ధతిలో చదవాలి.
- జీకేలో నృత్యాలు, కళలు, ఆవిష్కరణలు, విటమిన్లు, జంతు సంబంధిత ఆసక్తికర సమాచారం.. జలపాతాలు, తెగలు, పత్రికలు, పుస్తకాలు, చారిత్రక కట్టడాలు, రాష్ట్రాల సమాచారం.. హైకోర్టు, సుప్రీం కోర్టు, స్వాతంత్ర్యోద్యమం, జాతీయ-రాష్ట్ర చిహ్నాలు, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర అంశాలు చదవాలి.
- ఎస్జీటీలు అయితే కంటెంట్‌ను చదివితే సిలబస్‌లో జీకే కోసం 70శాతం సమాచారం కవర్ అవుతుంది. కరెంట్ అఫైర్స్‌పై ఎక్కువగా దృష్టిసారించాలి.
- గత ప్రశ్నపత్రాలు ఒకసారి చదవడం, చూడడం వల్ల ఏ తరహా ప్రశ్నలు అడుగుతున్నారో తెలుస్తుంది. అలాగే మాక్ టెస్ట్‌లను పరిశీలించాల్సి ఉంది.
- ఏడాదిగా వివిధ పోటీ పరీక్షల జనరల్ స్టడీస్ ప్రశ్నలను పరిశీలిస్తూ ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఆర్థికవ్యవస్థ, పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన ఉంటే చాలా మంచిది.



పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

బొబ్బిలి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా మెలిగి పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే పెనువిపత్తుల నుంచి మానవాళికి ముప్పు తప్పదని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. స్థానిక రాణిమల్లమ్మదేవి మునిసిపల్ పార్కు చెరువు గట్టుపై మొక్కలు నాటారు. కార్య క్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనరు లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, మున్సిపల్ సిబ్బందితో బేబీనాయన పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు.



బొబ్బిలి: పార్కు చెరువు గట్టుపై మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బేబీనాయన



పార్వతీపురం రూరల్: గంగాపురంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

మొక్కలు నాటాలి

బలిజిపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని, దీని కోసం విరివిగా మొక్కలు నాటాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని అరసాడ గ్రామంలో మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

పర్యావరణానికి నడుంబిగిద్దాం

రాజాం, జూన్5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరూ నడుం బిగించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని గోపాలపురం రోడ్డులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 90 వేల మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. ప్రతీ ఒక్కరూ ఓ మొక్క నాటి దాన్ని సంరక్షించాలన్నారు. అనంతరం స్థానికులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు.

మొక్కలు నాటిన తోయిక జగదీశ్వరి

కురుపాం రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి తెలిపారు. తెన్నుఖర్జ గ్రామంలో అటవీశాఖ, ఎస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మొక్కలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో ఉమామహేశ్వరి, అటవీ శాఖ అధికారి గోవిందరాజు, షేక్ గౌస్, అంబుడ్స్‌మన్ కొవ్విడి సన్యాశిరాజు పాల్గొన్నారు.



కురుపాం రూరల్: తెన్నుఖర్జలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లిమర్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. నెల్లిమర్ల నియోజక వర్గంలో రెండు నగరవనాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిధులు మంజూరుచేశారన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, బంగారు సరోజిని, రవ్వానాని, అప్పికొండ రవికుమార్, మజ్జి రాంబాబు, పొంద్రంకి సత్యనారాయణ, జనా ప్రసాద్, పతివాడ గోవిందరావు, నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్లలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- సీతంపేటలో 'యోగాంధ్ర'
- పెద్ద సంఖ్యలో హాజరైన యువత, మహిళలు, ఉద్యోగులు

పార్వతీపురం/సీతంపేట రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా చేయాలని, దీనివల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువత, మహిళలు, వివిధ శాఖల ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సుమారు 1400 మంది ఆసనాలు వేశారు. కలెక్టర్‌తో పాటు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌వో భాస్కరరావు తదితరులు హాజరై యోగా చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ఈ నెల 21 వరకు ఈ కార్యక్రమం జిల్లాలో కొనసాగుతుంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 21న విశాఖపట్నం వస్తున్నారు. యోగాంధ్ర ముగింపు కార్యక్రమం ప్రధాని సమక్షంలో జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్య క్రమాన్ని నిర్వహిస్తుంది. దీన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఎంతో కృషి చేస్తుంది. ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. యోగా చేయడాన్ని అలవాటు చేసుకోవాలి.' అని అన్నారు. ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. యోగా అనేది ఒక మంచి కార్యక్రమమని, ప్రతిరోజూ యోగా చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి కవిత, డీపీఎంవో పీఎల్ రఘు, ఐటీడీఏ ఏపీవో జి.చినబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎస్సీ యువత నైపుణ్యానికి తగ్గట్టు ఉపాధి

- ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేస్తాం
- మాల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్

విజయనగరం కలెక్టరేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలు ముఖ్యంగా మాలల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని మాలల సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పెదపూడి విజయకుమార్ తెలిపారు. ఎస్సీ యువత నైపుణ్యానికి తగ్గట్టు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గురువారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న ఉపాధి కల్పన పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి వాటిని ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా రూపకల్పన చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల ఆర్థికాభివృద్ధికి ఈ ఏడాది రూ.340 కోట్ల బడ్జెట్ కేటాయించిదని, ఈ నిధులతో స్వయం ఉపాధి పథకాలను రూపొందిస్తామని తెలిపారు. ప్రతి ఇంట్లో ఒక ఎస్సీ యువతి, యువకుడును ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ఉన్న నైపుణ్యాలను మెరుగుపరిచే శిక్షణను ఎస్సీ యువతకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కలెక్టరు కార్యాలయం సమీపంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, దీన్ని బాగు చేయించే చర్యలు చేపడతామని చెప్పారు. ముందుగా కలెక్టరు అంబేడ్కర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వివిధ పథకాలపై చర్చించారు. సమావేశంలో ఎస్సీ మాల కార్పొరేషన్ డైరక్టరు మరిడయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన చైర్మన్ విజయకుమార్

రేషన్ మాగ్రామంలోనే అందించాలి

దుంగాడ, చినదుంగాడ గ్రామాల గిరిజనులు డిమాండ్

వేపాడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుపర్తి శివారు చినదుంగాడ, పెదదుంగాడ, కొలికి పాలెం గిరిజనులు తమ గ్రామంలోనే రేషన్ సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. దుండాగ గ్రామం పేరున రేషన్ దుకాణం ఉన్నా డీలర్ తన సొంత గ్రామమైన చామలాదేవి అగ్రహారంలో ఇంటి వద్ద సరకులు పంపిణీ చేయడం వల్ల 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. దీంతో వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి దుంగాడ, చినదుంగాడ గ్రామాల్లో ఏదో ఒకచోట డిపో పెట్టించి సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని వేపాడ తహసీల్దార్, సీఎస్‌డీటీల దృష్టికి తీసుకుని వెళ్లగా పరిశీలించి న్యాయం చేస్తామన్నారని తెలిపారు.



దుంగాడలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరుతున్న దుంగాడ గిరిజన మహిళలు

రెవెన్యూశాఖలో భారీగా బదిలీలు

విజయనగరం/కలెక్టరేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూశాఖలో తహసీల్దార్ నుంచి వీఆర్వో వరకు బదిలీలు జరిగాయి. విజయనగరం జిల్లా నుంచి మన్యం జిల్లాకు, అక్కడి నుంచి ఈ జిల్లాకు ఉద్యోగులను బదిలీ చేశారు. గురువారం రాత్రి ఉద్యోగులను బదిలీ చేస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. 11 మంది తహసీల్దార్లు, 21 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 27 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, 39 మంది గ్రేడ్-1 వీఆర్వోలు, 50 మంది గ్రేడ్-2 వీఆర్వోలు బదిలీ అయిన వారిలో ఉన్నారు. మొత్తం 153 మంది బదిలీ అయ్యారు. నెలిమర్ల తహసీల్దారు సుదర్శనరావును సంతకవిటికి, మెంటాడ తహసీల్దారు శ్రీనివాసరావు ఎల్.కోటకు, ఎస్.కోట తహసీల్దారు అరుణకుమారిని మెంటాడకు, జామి తహసీల్దారు ఐ.కృష్ణలతను రేగిడి ఆమదాలవలసకు, రాజాం తహసీల్దారు కృష్ణంరాజును జామికి బదిలీ చేశారు. అలాగే కలెక్టరేట్‌లో ఏవో ఎల్ఆర్‌గా పనిచేస్తున్న ఎ.శ్రీకాంత్‌ను నెలిమర్లకు, డెంకాడ తహసీల్దారు పద్మావతిని వంగరకు, వంగరలో పనిచేస్తున్న డి.ధర్మరాజును డెంకాడకు, విజయనగరం ఏవో పనిచేస్తున్న డి.శ్రీనివాసరావును ఎస్.కోటకు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మిశ్రాను విజయనగరం ఆర్డీవో కార్యాలయం ఏవో బదిలీ చేశారు. పూసపాటిరేగ తహసీల్దారు గోవిందను కలెక్టరేట్ సి.సెక్షన్ సూపరింటెండెంట్‌గా, శ్రీకాకుళం కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌ను రాజాం తహసీల్దారుగా నియమించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో పనిచేస్తున్న అప్పలరాజును కొత్తవలసకు, కురుపాం తహసీల్దారు ఎం.రమణమ్మను భోగాపురానికి, సాలూరు తహసీల్దారు ఎన్‌వీ రమణను పూసపాటిరేగకు బదిలీ చేశారు.

సంతకవిటి తహసీల్దారు పి.సత్యంను శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. ఎల్.కోట తహసీల్దారు బీఎంజీఎస్ ప్రసాదరావు, కొత్తవలస తహసీల్దారు నీలకంఠరావు, భోగాపురం తహసీల్దారు ఎన్.సురేష్‌ను మన్యం జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మరికొంతమంది తహసీల్దార్లు, డీటీలను కూడా జిల్లాలను మార్చారు.

వేటకు సన్నాహాలు

● ఈనెల 14 అర్ధరాత్రితో నిషేధం ముగియనున్న నిషేధం

● వలలు, పడవల మరమ్మతుల్లో మత్స్యకారులు

భోగాపురం, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం, కొత్తపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులు వేట సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సమయంలో ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు ప్రభుత్వం సముద్రంలో చేపల వేట నిషేధిస్తోంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతిని సైతం ప్రభుత్వం అందజేస్తోంది. ఈ ఏడాది ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం రూ.20వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే మరో రెండు వారాల్లో వేట నిషేధం ఎత్తివేయనుండటంతో మళ్లీ ఎప్పటి మాదిరిగానే సముద్రంలో చేపల వేట సాగించేందుకు మత్స్యకారులు వేట సామగ్రిని సమకూర్చుకుంటున్నారు. పడవలకు మరమ్మతులు చేస్తున్నారు. చిరిగిన వలలను అల్లుతున్నారు. ఇంజిన్లను వేటకి సిద్ధం చేస్తున్నారు. ఈనెల 14 అర్ధరాత్రితో చేపల వేట నిషేధం గడువు ముగుస్తున్న నేపథ్యంలో అందుకోసం వేచి చేస్తున్నారు.


పడవను బాగు చేసుకుంటున్న మత్స్యకారులు


ముక్కాంలో వలలు అల్లుకుంటూ..


సమావేశంలో మేయర్ విజయలక్ష్మి

సుందరీకరణకు విఘాతం కలిగిస్తే చర్యలు

విజయనగరం రింగురోడ్డు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం సుందరీకరణకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని మేయర్ విజయలక్ష్మి స్పష్టం చేశారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ ఆమె స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 31 అంశాల్లో 2 అంశాలు మినహా మిగిలిన అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు రాజేశ్, అల్లు చాణక్య, సుంకర నారాయణస్వామి, రూపాదేవి, సహాయ కమిషనర్ అప్పలరాజు ఉన్నారు.

ఐపీపీబీ ఖాతా తెరవండి

గజపతినగరం, జూన్5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలంటే పోస్టాఫీసుల్లో ఐపీపీబీ ఖాతా తెరవాలని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పథకాల లబ్ధిదారులు దగ్గరలోని పోస్టాఫీస్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 10 నుంచి 20 లోపు ఈఎస్ఈ గవర్నమెంట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను పాఠశాలకు అందజేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తామరాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ త్రినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొండ తామరాపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా ఉందన్నారు.

●రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట సబ్‌స్టేషన్, సంకిలి ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈ సురేష్ తెలిపారు. సంకిలి, చిన్నయ్యపేట, కొమిరి, లక్ష్మీపురం, అప్పాపురం, దేవుదళ, పుర్లి, ఖండ్యాం, వెంకటాపురం తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

గజపతినగరం, జూన్5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో విమలమ్మ అన్నారు. గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు జిల్లా సమన్వయకర్త తవుడమ్మ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో-2 చక్రధరరావు పాల్గొన్నారు.

వెన్నుపోటు పొడిచింది వైసీపీనే..

రాజాం, జూన్5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి వెన్నుపోటు పొడిచింది వైసీపీయేనని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఇప్పుడు ఆ పార్టీ ఉనికి చాటడం కోసం ధర్నాలు, నిరసనలు చేస్తోందని విమర్శించారు. ఇటీవల వెన్నుపోటు దినాన్ని ఆ పార్టీ నిర్వహించడాన్ని ఆయన ఖండించారు. గురువారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అధికారంలో వచ్చిన తొలి ఏడాదిలోనే చంద్రబాబు సర్కారు 70 శాతం హామీలు అమలు చేసిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో 85 శాతం హామీలు ఎగనామం పెట్టి జగన్ ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని గుర్తుచేశారు. తొలి ఏడాదిలో జరిగిన అభివృద్ధిని చూసి జగన్ కోటరీ ఓర్వలేకపోతోందన్నారు. నెలకు రూ.4 వేలు ఫించన్ మొత్తాన్ని పెంచి ఏడాదికి రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. 20 వేల కిలోమీటర్ల రోడ్లకు రూ.1200 వేల కోట్లు వ్యయం చేశామన్నారు. 16347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైందని గుర్తుచేశారు. అష్ఠం జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసీపీ సిగ్గుపడాలన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, దుప్పలపూడి శ్రీనివాసరావు తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

ప్రజాదర్బార్‌కు 50 వినతులు

అనంతరం రాజాంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. దాదాపు 50 వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవరావు, గురవాన నారాయణరావు, పిన్నింటి మోహనరావు, శాసపు రమేశ్, పెంకి గౌరీశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

రాజాం, జూన్ 5,(ఆంధ్రజ్యోతి): మండలంలో పొగిరి రైతు సేవాకేంద్రంలో గురువారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జడ్డు విష్ణు, గురవాన నారాయణరావు, డి.శ్రీనివాసరావు, వంగ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే మానసికోల్లాసం

డెంకాడ, జూన్5 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం, మానసికోల్లాసం సాధ్యమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో భవాని ఆధ్వర్యంలో మెగా యోగా శిబిరం ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్య జీవన శైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ యోగా చేయడం అవసరమన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ వాసుదేవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, పాణిరాజు, జనసేన నాయకులు తుమ్మి లక్ష్మీరాజ్, అప్పారావు, చింతపల్లి రామ్మూర్తి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

భోగాపురం, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన బోర అప్పారావుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.10 లక్షలు మంజూరయ్యాయి. గురువారం పోలిపల్లిలోని నివాసంలో సంబంధిత చెక్కును మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు.. అప్పారావుకు అందజేశారు. కార్యక్రమంలో దాసరి అప్పలస్వామి, చిల్ల సురేష్‌రెడ్డి, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న బంగార్రాజు

హామీల అమలులో నిర్లక్ష్యం

నెల్లిమర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలకులు గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నర్సయ్య ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు గురువారం రామతీర్థం జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఫిర్యాదు ప్రతులను సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనిగిరి శ్రీనివాసరావు, చిన్నం అరుణ్‌కుమార్, మరడాన వెంకటనాయుడు, పైల జ్యోతి, పొడుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలిద్దాం: కలెక్టర్

విజయనగరం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. గురువారం జడ్పీ సమావేశ భవనంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపునకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పర్యావరణానికి హాని చేసే వాటిని వీడనాడాలన్నారు. మానవుల జీవన సరళిలో హాని చేసే వాటిని నిర్మూలించి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్‌పై యుద్ధాన్ని ప్రకటించామన్నారు. దుకాణాలపై దాడులు చేసి ఎక్కడ ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూస్తున్నామన్నారు. జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు మాట్లాడుతూ ఒక్కరోజే నాలుగు లక్షల మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, సీఈవో వెంకటరమణ, రామకృష్ణ, ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

కొలువుదీరనున్న వేంకటేశ్వరుడు




ప్రతిష్ఠించేందుకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు, పూజల్లో ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుణ్యగిరి కొండ దిగువ భాగంగా పద్మావతి, గోదాదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామి కొలువుదీరనున్నారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం ఉదయం నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. నిర్మాణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా ఆలయ ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు గురువారం ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ ఇందుకూరి రఘురాజు పూజలు నిర్వహించారు. శుక్రవారం చేపట్టనున్న విగ్రహాల ప్రతిష్ఠోత్సవానికి పట్టణ ప్రజలతో పాటు సమీప గ్రామాల భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ

విజయనగరం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ధర్మపురిలోని దత్తసాయి సమర్థపీఠంలో గురువారం సాయిబాబా ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అవదూత సాయి సుందర మహారాజ్ చేతుల మీదుగా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సన్నిబాబు, రామ్మోహన్, కృష్ణ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


శిఖర ప్రతిష్ఠ దృశ్యం

బోడసింగిపేటలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

బొండపల్లి, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండలంలో బోడసింగిపేటలో గురువారం సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు దేవరకొండ వెంకటరమూర్తి శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల జానకిరావు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు.


ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణుల విగ్రహాలు

●సంతకవిటి, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంవలసలో నిర్మించిన అభయాంజనేయ సమేత వేణుగోపాలకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం ప్రాతః కాల అర్చనలు, మండల పునఃపూజ, సూర్యనమస్కారములు, వేదపారాయణం, క్షీరాధివాసం, అష్టదిగ్బలి, కుంకుమ పూజలను వేదపండితుడు పెంట వాసుదేవశర్మ నిర్వహించారు.


పూజల్లో పాల్గొన్న మహిళలు

శుభకార్యానికి వచ్చి అనంత లోకాలకు..

● నేలబావిలో స్నానానికి దిగి విద్యార్థి మృతి

● మృతుడిది పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు


అజిత్‌కుమార్ (ఫైల్)

జి.సిగడాం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి బంధువుల వివాహానికి వచ్చి ఓ విద్యార్థి మృత్యువాత పడిన ఘటన పెంట గ్రామంలో బుధవారం సాయంత్రం సంభ వించగా గురువారం బయటపడింది. వివాహ వేడుకలు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తాడనుకున్న కుమారుడు మరి రాలేడని తెలుసుకుని ఆ తల్లి తల్లడిల్లగా ఆమెను వారించడం ఎవరితరమూ కాలేదు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణం దుగ్గాన వీధికి చెందిన దుగ్గాన అజిత్ కుమార్ (18) విజయవాడలో ఓ ప్రైవేటు యూనివర్సిటీలో బీటెక్ సీఎస్ఈ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సెలవులకు స్వగ్రామం వచ్చిన అజిత్ కుమార్ విజయనగరం జిల్లా సంతకవిటి మండలం పుల్లిట గ్రామంలో తన స్నేహితుడు తామాడ మహేష్ చెల్లి వివాహానికి బుధవారం వచ్చాడు. పుల్లిట గ్రామానికి సుమారు 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న పెంట గ్రామంలో నేల బావి వద్దకు స్నేహితులు తామాడ మహేష్, చిట్టివలస కుమార్, రాజులతో కలిసి స్నానానికి వెళ్లాడు. అజిత్ కుమార్ స్నానానికి దిగి ఈత రాకపోవడంతో బావిలో మునిగి పోతుండగా స్నేహితులు బావిలో దూకి కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం కనిపించక పోవడంతో పెంట గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు మృతుడి తల్లి సుజాత కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న తల్లి, చెల్లిలతోపాటు బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. నేలబావిలో 30 అడుగుల లోతులో నీరు ఉండడం తో గ్రామస్థుల సహకారంతో మోటార్లతో నీటిని బయటకు తోడించి మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు 15 ఏళ్ల కింద మృతిచెందగా తల్లి అజిత్ కుమార్‌ని ఉన్నత చదువులు చదివిస్తోంది. కళ్ల ముందు పెరిగిన కుమారుడు విగతజీవిగా కనిపించడంతో ఆమె బోరున విలపించి ఆమె సొమ్మసిల్లింది. గ్రామస్థుల సమాచారం మేరకు ఎస్ఐ వై.మధుసూదన రావు, ఏఎస్ఐ పి.శంకరరావు సిబ్బందితో గురువారం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహానికి శవ పంచ నామా చేసి పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నెల్లిమర్ల, జూన్5 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో గురువారం ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడు మండలంలోని మొయిద నారాయణపట్నం గ్రామానికి చెందిన పతివాడ నారాయణరావుగా గుర్తించారు. నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ కథనం మేరకు.. జరజాపుపేటలో ఒక ఇంటిలో సీలింగ్ పనులు చేసేందుకు రోజు కూలీగా వచ్చిన ఆయన ఆ ఇంటిలో పని చేస్తున్న సమయంలో తన చేతిలోని ఇనుపరాడ్డు ప్రమాదవశాత్తు ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌కు తాకింది. దాంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు వెంటనే ఆసుపత్రికి తరలించే సరికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. మృతుడు నారాయణరావుకు భార్య పైడితల్లి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దుక్కి యంత్రం తగిలి రైతు..

సీతానగరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని కామందొరవలసలో గురువారం ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న సమయంలో యంత్రం తగిలి రైతు మృతి చెందాడు. ఎస్ఐ ఎం.రాజేశ్ కథనం మేరకు.. కామందొరవలసలో బురిడి రామారావు(46) తన పొలంలో దుక్కి దున్నే నిమిత్తం ట్రాక్టర్‌ను రప్పించుకున్నాడు. ట్రాక్టర్ వెనుక ఉన్న రోటావేటర్‌కు తగిలిన గడ్డిని తీయాలని డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి సూచించాడు. దీంతో రామారావు రోటావేటర్‌కు ఉన్న గడ్డిని తీస్తుండగా డ్రైవరు వెనక్కి చూడలేదు. దీంతో రోటావేటర్ బ్లేడ్లు ఛాతిపైన బలంగా తగలడంతో రామారావు మృతి చెందాడు. రామారావు కుమారుడు తిలక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. రామారావుకు తల్లి, భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఐదు నిమిషాల్లో ఇంటి చేరుకునేలోగా..

● లారీ ఢీకొని యువకుడి మృతి


సాయికుమార్ (ఫైల్)

రామభద్రపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మరో ఐదు నిమి షాల్లో ఇంటికి చేరుకుంటాడన్న తరుణంలో ఓ యువకుడిని మృత్యువు కబళించింది. ఎస్ఐ వెలమల ప్రసాద్ కథనం ప్ర కారం.. దత్తిరాజేరు మండలంలోని స్టేషన్ బూర్జవలసకు చెందిన కస్తూరి సాయికుమార్ (21) ఆరికతోట నుంచి స్వగ్రామం ద్విచక్రవాహనంపై గురువారం సాయంత్రం వెళ్తున్నాడు. విజయనగరం నుంచి రామభద్రపురం వస్తున్న లారీ ఆరికతోట సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సాయి కుమార్ తండ్రి ప్రభాకరరావు, తల్లి లక్ష్మితోపాటు ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. ట్రాక్టర్ నడపడంతో పాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆధారంగా ఉంటాడనుకున్న సమయంలో సాయికుమార్ మృతితో తల్లిదండ్రులు రోదిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

400 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

కొత్తవలస, జూన్5 (ఆంధ్రజ్యోతి): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ సింహాచలం ఆధ్వర్యంలో గురువారం దాసరివానిపాలెం వద్ద ఆటోలో తరలిస్తున్న 400 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని సత్యవరపు వెంకట బంగార్రాజు తరలిస్తున్నట్టు గుర్తించి 6-ఎ కేసు నమోదు చేశారు. బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేసి సీఎస్ డీటీ రామకృష్ణకు అప్పగించారు.


ఐదుగురిపై కేసు నమోదు

సంతకవిటి, జూన్5 (ఆంధ్రజ్యోతి): దాడి చేశారని మండలంలోని తాలాడ గ్రామానికి చెందిన సవలాపురపు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై గురువారం కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్. గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పది రోజుల కిందట ఇరు కుటుంబాల మధ్య తగాదా జరగడంతో గ్రామంలో రాజీ కుదిరిందన్నారు. తర్వాత అదే తగాదా మళ్లీ ఇరు కుటుంబాల మధ్య జరిగిందన్నారు. దాంతో లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కోళ్లఫారాన్ని ఎత్తివేయాల్సిందే..

●నాలుగు గ్రామాల ప్రజల ఆందోళన

మెంటాడ, జూన్5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిరసాడవలసలో రోడ్డుకు ఆనుకుని ఉన్న కోళ్ల ఫారాన్ని ఎత్తివేయాలని నాలుగు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం కోళ్ల ఫారం ఎదుట బిరసాడవలస ఎస్టీ కాలనీ వాసులు, గదబవలస, కైలామ్, జయతి గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. కోళ్ల ఫారాన్ని తొలగించే వరకూ ఇక్కడ నుంచి కదిలేది లేదని తెగేసి చెప్పారు. అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడారు. ఐదేళ్ల కిందట ఏర్పాటై కోళ్ల ఫారం నుంచి వెలువడుతున్న దుర్వాసనను భరించలేక పోతున్నామన్నారు. కోళ్ల వ్యర్థాలను గుంతలో వారు వేస్తున్నప్పటికీ దాని ఊట వల్ల సమీపంలో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. అలాగే దగ్గరలోని అనంత సాగరంలోని చేపలు చనిపోతున్నాయని ఆవేదన చెందారు. తక్షణమే కోళ్ల ఫారాన్ని తొలగించకపోతే ఆ పని తాము చేస్తామని తేల్చి చెప్పారు. గత నెల 24న ఆందోళనకు దిగితే, ఈ నెల 5 నాటికి సమస్యలు పరిష్కరిస్తామని సంబంధిత యాజమాన్యం హామీ ఇచ్చి మరచిందని వారు మండిపడ్డారు. ఆందోళనకారులకు కూటమి నేతలు చలుమూరి వెంకటరావు, ఎస్.రాజశేఖర్, మన్నెపూరి అప్పలనాయుడు తదితరులు మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా కోళ్ల ఫారాన్ని వెంటనే మూసివేయాలని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రాకోటి రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.


ఆందోళన చేస్తున్న బాధితులు, కూటమి నాయకులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

విజయనగరం క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో న్యాయాధికారులు బి.అప్పలస్వామి, ఎన్.పద్మావతి, బీహెచ్‌పీ లక్ష్మీకుమారి, డీఎస్ఎల్ఏ కార్యదర్శి కృష్ణప్రసాద్, మొబైల్ కోర్టు న్యాయాధికారి బుజ్జి, కౌన్సిల్ ప్రెసిడెంట్ రవిబాబు పాల్గొన్నారు.

●గజపతినగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జనసేన పీఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ అన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జగన్, నాయకుడు లక్ష్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.


మెరకముడిదాంలో మొక్క నాటుతున్న డీపీవో

●విజయనగరం దాసన్నపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వెంకటరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జీఎం ఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణ సంస్థలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జీఎంఆర్ ప్రతినిధి కె.వెంకటరమణ, సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు. ●జేఎన్‌టీయూ గుర జాడలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ డి.రా జ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, ప్రిన్సిపాల్ రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

● అలకానంద కాల నీ మున్సిపల్ పార్కులో సెట్విజ్-తమన్నా ఫౌండేషన్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టిం ది. కార్యక్రమలో ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, కర్రోతు సత్యం, నరసింహరావు, బొడ్డేపల్లి రామకృష్ణారావు, అప్పారావు, హరికృష్ణ, రమేశ్ పాల్గొన్నారు. ●ఎంఆర్ ఫార్మసీ కళాశాలలో గురువారం మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ రామయ్య, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

●దత్తిరాజేరు: మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆర్డీవో రామ్మోహనరావు తెలిపారు. మండలంలోని పెదమానాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.విజయభాస్కర్, ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

●మెరకముడిదాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతఅని డీపీవో టి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గర్భాంలో ఎంపీడీవో జి.భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం బోడందొరవలస నుంచి చెల్లాపురం వరకు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఐ.విశ్వనాథం, ఈసీ నరేంద్రకుమార్, సర్పంచ్ గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

●రాజాం: పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం పట్టణంలోని 20వ వార్డు సచివాలయం ఆవరణలో బీజేపీ నాయకుడు కోటగిరి నారాయణరావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది మొక్కలు నాటారు.

●నెల్లిమర్ల: పర్యావరణ దినోత్సవంలో భాగంగా నెల్లిమర్లలోని మహరాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ విద్యార్థులు ఉత్సాహంగా మొక్కలు నాటారు. అలాగే ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని సంస్థ నిర్వాహకులు పిలుపునిచ్చారు.



మొక్క నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత


దత్తిరాజేరులో మొక్క నాటుతున్న ఆర్డీవో

ఫిర్యాదులపై సీడీఎంఏకు నివేదిక

● మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ రవీంద్ర



ఫిర్యాదుదారులను విచారిస్తున్న రవీంద్ర

పార్వతీపురంటౌన్,జూన్5 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులపై నివేదికను అమరావతిలోని సీడీఎంఏ పంపించిన తర్వాతవిచారణ అనంతరం చర్యలు చేపడతామని మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. గురువారం పార్వతీపురంలోని మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో నిబంధనలు, చట్టాలపై మునిసిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లుపై వచ్చిన ఫిర్యాదులపై రవీంద్ర విచారణ చేపట్టారు. అనంతరం రవీంద్ర విలేకరులతో మాట్లాడుతూ గతనెల 16న మునిసిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షలో వచ్చిన సమస్యల పరిష్కారంతోపాటు ఇటీవల సీడీఎంఏ సంపత్‌కుమార్‌కు మునిసిపల్ కమిషనర్‌పై పలువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు.మాజీ కౌన్సిలర్, నాయుడు వీధికి చెందిన గొర్లి వెంకటరమణ కౌన్సిల్ ఆమోదం లేకుండా ఆశీలు వసూలు జరుగుతోందని కమిషనర్‌పై ఫిర్యాదు ఇచ్చినట్లు చెప్పారు.పట్టణ సమస్యలతోపాటు కమిషనర్‌పై ఫిర్యాదు చేసిన మాజీ కౌన్సిలర్ పాకల సన్యాసిరావు విచారణకు హాజరు కాలేదన్నారు.నైట్‌షెల్టర్ నిర్వహణకు గతఏడాది సెప్టెంబరులో కౌన్సిల్ ఆమోదం తెలిపినా కమిషనర్ అనుమతి ఇవ్వడం లేదని అరస్వా ఎన్‌జీవో నిర్వహకురాలు దయామణి ఫిర్యాదులపై విచారించామన్నారు.మునిసిపల్ ఛైర్‌పర్సన్ బి.గౌరీశ్వరీ, కమిషనర్‌తోపాటు అధికారుల వ్యవహార తీరుపై ఇచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కొత్తవలస సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో 16 సెంట్లు అక్రమణలకు గురైయ్యిందని, రెవెన్యూ అధికారులు స్పష్టం చేసినా మునిసిపల్ ప్రణాళిక విభాగం అధికారులతోపాటు కమిషనర్ చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదుపై రీజినల్ టౌన్ ప్లానింగ్ డైరెక్టర్‌కు ఈ విషయాన్ని తెలియజేస్తామని చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు

● గదబవలసలో తాగునీటి పథకాలు పరిశీలించిన కేంద్ర బృందం సభ్యులు



జేజేఎం కుళాయిలను పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు

గరుగుబిల్లి,జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్రం పలు పథకాలకు అవసరమైన నిధులు కేటాయిస్తోందని కేంద్ర బృందం డైరెక్టర్ తరుణ్ దోలియా తెలిపారు. గురువారం చినగుడబ పంచాయతీలోని గదబవలసలో జలజీవన్‌మిషన్‌కు చెందిన తాగునీటి పథకాల పనితీరును కేంద్ర బృందం డైరెక్టర్ తరుణ్ దోలియా, వాటర్ కమిషన్ డైరెక్టర్ నిఖిల్ జెప్, శాస్త్రవేత్త డి.అనంతరావులు పథకంలో ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలించారు. ఈసందర్భంగా దోలియా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఏ మేరకు పథకాలు అమలు చేస్తున్నారన్న దానిపై పరిశీలిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ జలాలను అందించేందుకు జలజీవన్ మిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గ్రామంలో ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలించి గ్రామస్థుల నుంచి సమాచారాన్ని సేకరించారు. కార్య క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకర్, డీఈఈ నాగేశ్వరరావు, ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్ ఎం.దుర్గాప్రసాద్, జేఈ గౌరీశంకరరావుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి వనరులున్నా.. ఉపయోగం సున్నా

(5వ పేజీ తరువాయి)

లేదు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు చేపట్టి, పిల్ల కాలువల ద్వారా సాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గొప్పలే మిగిలాయి..

వంశధార ప్రాజెక్టు పనులు 2022 నాటికే పూర్తి చేస్తామని గత వైసీపీ సర్కార్ గొప్పలు చెప్పింది. కానీ, ఐదేళ్లలో ఎక్కడా తట్టెడు మట్టి పనులు చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లాల విభజనతో భామిని మండలం పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసింది. ఈ మండల పరిధిలోనే వంశధార ప్రాజెక్టు ప్రధాన పనులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి. వంశధారకు వచ్చిన వరద నీటిని కాట్రగడ ఓపెన్‌హెడ్ చానల్ ద్వారా హిరమండలం వద్ద నిర్మించిన వంశధార రిజర్వాయర్‌కు మళ్లించేలా డిజైన్ రూపొందించారు. టీడీపీ ప్రభుత్వంలో 2018లో వరదల సమయంలో ఒక్కసారి మాత్రమే నీటిని మళ్లించారు. ఆ తరువాత ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. గత రెండేళ్లుగా వంశధారలో ఆశించిన వరదలు లేకపోవడంతో నీరు మళ్లింపు నామమాత్రంగానే సాగింది. ఇప్పటికైనా సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గేట్లు ఏర్పాటు చేసి పిల్ల కాలువల ద్వారా నీరు మళ్లించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనివల్ల పసుకుడి, భామిని, లివిరి, దిమ్మిడిజోల, బాలేరు, ఘనసర తదితర గ్రామాలకు సాగునీటి కష్టాలు తీరుతాయి.

త్వరలో గేట్లు ఏర్పాటు చేస్తాం

వంశధార వరద కాలువలో లైనింగ్ పనులు చేపడుతున్నాం. పెండింగ్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు త్వరలో గేట్లు అమర్చుతాం. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- భవానీ శంకర్, వంశధార డీఈ

ఈ మాంసం తిన్నారో అంతే!

(5వ పేజీ తరువాయి)

వధించలేదు. నిబంధనలు ప్రకారం శ్లాటర్ హౌజ్ వద్ద పశుసంవర్ధకశాఖ అధికారి లేదా సంబంధిత అధికారి ప్రతినిధి పొట్టేలు ఆరోగ్యంగా ఉందని ధ్రువీకరించిన తర్వాతే దానిని వధించాలి. దానిపై పశుసంవర్ధక శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు రబ్బరు స్టాంపులు వేయాలి. ఆ తర్వాతే తాజా మాంసాన్ని విక్రయించాలి. అయితే పట్టణంలో ఇవేవీ అమలు కావడం లేదు. శ్లాటర్ హౌజ్ కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. ఇప్పటికీ దానికి కరెంట్, బోర్ లేదు. దీంతో వ్యాపారులు తమ పొట్టేళ్లను రోడ్లపై, అపరిశుభ్ర పరిసరాల్లో వధించి విక్రయిస్తున్నారు. అయితే అవి ఆరోగ్యంగా ఉన్నాయో లేవో ధ్రువీకరించే నాథుడేలేడు. చికెన్ అమ్మకాలు కూడా ఈ విధంగానే జరుగుతున్నాయి.చచ్చిన, కుళ్లిన, నిల్వఉన్నమాంసాన్ని అపరిశుభ్ర పరిసరాల్లో విక్రయిస్తున్నారు. చాలామంది వ్యాపారులు పరిశుభ్రత ప్రమాణాలు పాటించడం లేదు.ఇటీవల శానిటరీ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 16 కిలోల కుళ్లిన బాయిలర్ కోడి మాంసాన్ని విక్రయించడానికి ప్రయత్నించిన వ్యాపారికి రూ. 3000 జరిమానా విధించారు.

నిషేధం ఉన్నా..

క్యాట్ ఫిష్‌పై నిషేధం ఉన్న సాలూరులో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కొన్ని నల్లజాతి చచ్చిన చేపలు అమ్మకాలు జరుపుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో మున్సిపల్‌పరంగా విస్తృతంగా తనిఖీలు ఉండేవి. గత కొంత కాలంగా ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మున్సిపాల్టీ వాసులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

తనిఖీలు విస్తృతం చేస్తాం

మున్సిపాల్టీలో తాజా మాంసాహారమే విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. మటన్, చికెన్, చేపల దుకాణాలను విస్తృతంగా పరిశీలిస్తాం. గతంలో ఇక్కడ నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ. 30 వేలు జరిమానా విధించాం. తాజాగా కుళ్లిన కోడి మాంసం అమ్మడానికి ప్రయత్నించి వ్యాపారికి రూ. 3 వేలు జరిమానా విధించాం. మాంసాహార వ్యాపారులు విధిగా నిబంధనలు పాటించాలి. లేకుంటే చర్యలు తప్పవు.

- లావేటి బాలకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సాలూరు మున్సిపాల్టీ

ధ్రువీకరించాల్సింది మేమే..

పొట్టేళ్లతదితర జంతువులు విక్రయానికి అనువుగా ఉన్నట్టు ధ్రువీకరించాల్సిమేమే. మున్సిపాలిటీలో శ్లాటర్ హౌజ్ నిర్వహించడం లేదు. మున్సిపాలిటీ ఒక స్థలం కేటాయించి.. రమ్మంటే అక్కడ ధ్రువీకరణ కార్యక్రమం చేపడతాం.

- సన్యాసిరావు, ఏడీ, పశుసంవర్ధక శాఖ , సాలూరు

సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

పరీక్ష జరగనుంది. ప్రతి సెంటర్‌లో 300 నుంచి 350 మంది వరకూ హాజరుకానున్నారు. హాల్ టిక్కెట్‌తోపాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకువెళ్లాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్ ఉంటారు.

గంట ముందు హాజరుకావాలి

డీఎస్సీ అభ్యర్థులు పరీక్ష సమయం కంటే గంట ముందు కేంద్రానికి చేరుకోవాలి. లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నాం. అభ్యర్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ఉండండి. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించాం.హాల్‌టిక్కెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలి.

- మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

ఐదు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

75 ఎకరాల్లోని కేరళ మార్షియస్ రకం పైనాపిల్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ రకం పైనాపిల్ ద్వారా గిరిజన రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన రైతులతో మాట్లాడి వారి అభి ప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం సీతంపేట ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. గిరిజనులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో పరికరాల పనితీరును పరిశీలించేందుకు కలెక్టర్ తన చెవికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బ్లడ్‌బ్యాంక్‌ను పరిశీలించి రక్తనిల్వలపై ఆరా తీశారు. ఈ పర్యటనలో ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో చిన్నబాబు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, డైరెక్టర్ కవిత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

(5వ పేజీ తరువాయి)

సంబంధించికార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలి. ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరికరాలను విద్యా కార్యకలాపాలకు సరిగ్గా ఉపయోగించుకోవాలి. పాములు, ఇతర విషపూరిత కీటకాల నుంచి పిల్లలను రక్షించడానికి చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులకు ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, స్థానిక పీహెచ్‌సీ సమన్వయంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. సికిల్ సెల్, అనీమియా పరీక్షలు చేయాలి. సురక్షితమైన తాగునీటిని అందించాలి. బాలికల విద్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థుల భద్రతపై నిఘా ఉంచాలి. జిల్లా అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బ యట వ్యక్తులను పాఠశాలల ప్రాంగణాల్లోకి అనుమతించకూడదు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాం ధ్ర కార్యక్రమం నిర్వహించాలి.' అని పీవో సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడు ఆర్.కృష్ణవేణి, ఉపవిద్యాశాఖ అధికారి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, ప్రోగ్రాంఅధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

మక్కువ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి.కృష్ణారావు కోరారు. గురువారం మక్కువలో మండల విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందించా రు. కార్యక్రమంలో భోజన నిర్వాహకుల మండల నాయకులు కృష్ణ, పార్వతీ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



బలిజిపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బలిజిపేట, జూన్5(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతుల పక్షాన ఉన్నారని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. గురువారం అరసాడలో ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ రత్నకుమారి, ఎంపీడీవో నగేష్, వ్యవసాయ అధికారి ఎం.శ్రావణ్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, గొట్టాపు వెంకటనాయుడు, రామ్మోహనరావు, టీడీపీ నాయకులు జి.సింహాచలంనాయుడు, కె.సింహాచలంనాయుడు, కె.గౌరీశ్వరరావు, ఎం.చిన్నంనాయుడు, బాబ్జీ, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

● పార్వతీపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.గంగాపురంలో సబ్సిడీ విత్తనాలను రైతులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీ నాయుడు, బోను దేవిచం ద్రమౌళి, తాన తిరుపతినాయుడు పాల్గొన్నారు.

●సీతానగరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. గాదెలవలస రైతుసేవా కేంద్రంలో వరి, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలి

●పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



భామిని: తహసీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

భామిని, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను తొలగించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. ప్రజా ప్రయోజనాల కోసం రహదారులు, భవనాలు నిర్మిస్తామంటే కొందరు ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని భామిని తహసీల్దార్ ఎన్.శివన్నారాయణ దృష్టికి ఎమ్మెల్యే గురువారం తీసుకెళ్లారు.తొలుత భామినిలో టీడీపీ, జనసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఘనసర, కీసర, నులకజోడు గ్రామాలను అభివృద్ధి చేస్తామంటే ప్రభుత్వ భూములను ఆక్రమణలను అడ్డుకుంటున్నారని కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకురాగా తహసీల్దార్‌కు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదీశ్వరరావు, రవినాయుడు, ఆనందరావు, గోవిందరావు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

వీరఘట్టం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధిచేసి యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. గురువారం మండలంలోని ఎం.రాజపురం గ్రామంలో ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కలిశారు.

రహదారి సౌకర్యం కల్పనకు కృషి

గుమ్మలక్ష్మీపురం/కురుపాం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):సీతంపేట గ్రామానికి రహదారి సౌకర్యంకల్పనకు కృషిచేస్తానని ప్రభుత్వవిప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు.గురువారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంపుకార్యాలయంలో కురుపాం మండలంలోని సీతంపేటకు బీటీరోడ్డు సౌకర్యంకల్పించాలని గ్రామస్థులు వినతిపత్రం అందించారు. తమ గ్రామం నుంచి గుజ్జుపాడు, కొమ్మవలస వరకు రోడ్డు వేయాలని కోరారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సీతంపేట గ్రామస్థులు

రిసోర్స్ కేంద్ర భవన నిర్మాణం పూర్తిచేయండి

పార్వతీపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో నిర్మాణంలో ఉన్న పంచాయతీ రిసోర్స్ కేంద్ర భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం పనులు పరిశీలించారు. నిర్మాణం నాణ్యతగా ఉండాలని, నాణ్యతలో రాజీ పడరాదని స్పష్టం చేశారు.

ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేయాలి

గరుగుబిల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏడాది పాటు పలు రకాల పంటలు సాగుపై రైతులు ఆసక్తి కనబరచాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ సూచించారు. గురువారం మండలంలోని దళాయివలసలో పలు రకాల పంటలు సాగును క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. కార్య క్రమంలో గరుగుబిల్లి, కొమరాడ వ్యవసాయాధికారులు ఆర్.విజయభారతి, పి.శంకరరావుతో పాటు రాష్ట్ర బృంద సభ్యులు మన్మోహన్, జయశ్రీ, ఎన్‌ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, వ్యవసాయ సిబ్బంది, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెలోకి మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

పార్వతీపురం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతా లు పెంపుదలతో పాటు సమస్యలు పరిష్కారం కోసం ఈనెల తొమ్మిదో తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లకు సమ్మె నోటీసును సభ్యులు అందజేశారు.

వెలగవాడలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్

పాలకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగవాడ, కొండాపురం, గోపాలపురంల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్య క్రమం గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆచార్య ఎన్‌జీ రంగా, కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు జి.అమృతవీణ వి.వెంకటేశ్వర్లు, పాలకొండ ఏడీఏ రత్నకుమారి ప్రభుత్వ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దుర్గా, అను, పూర్ణబిందు, ఎస్.శ్రీనివాసరాజు, విశ్వనాథ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి వాహిని పాల్గొన్నారు.

ఎస్ఎన్ఎంనగర్‌లో పార్కు అభివృద్ధి చేయాలి

పార్వతీపురంటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):ఎస్ఎన్ఎంనగర్‌లో మునిసిపల్ పార్కును అభివృద్ధి చేసేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సౌందర్య నారాయణమూర్తి నగర్ ఫ్యామిలీస్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు జి.శంకరరావు, ఎం.రాజాలు కోరారు. కాలనీ సమస్యల సాధనలో ఐకమత్యంగా ఉంటామని తెలిపారు. గురువారం పార్వతీపురంలోని ఎస్ఎన్ఎంనగర్ కాలనీలో సౌందర్య నారాయణమూర్తి నగర్ ఫ్యామిలీస్ అసోషియేషన్ భవన ప్రారంభోత్సవం పురస్కరించుకుని పూజలు చేశారు.కార్యక్రమంలో ఆ కాలనీ అసోషియేషన్ సభ్యులు కె. ప్రభాకరరావు, జల్లుబాబ్జీ, పి. బుజ్జి, వి. జగదీష్, ఎం. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో జాప్యం చేయవద్దు

గరుగుబిల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి):చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు అందించడంలో జాప్యం చేయవద్దని మండల ప్రత్యేకాధికారి ఓ.ప్రభాకరరావు సూచించారు. గురువారం గరుగుబిల్లిలోని చౌక ధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో జి.పైడితల్లి పాల్గొన్నారు.

తులసిరామినాయుడువలసలో ఏనుగులు

గరుగుబిల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళాయివలస పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపు గురువారం మరోసారి తులసిరామినాయుడువలసకు చేరుకుంది. ఇక్కడ ప్రధాన రహదారికి ఆనుకుని ఏనుగుల గుంపు సంచరించడంతో గ్రామస్థులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి ఆనుకుని గ్రామం ఉండడంతో ఏ నిమిషంలో చేరుకుంటాయోనని భీతిల్లుతున్నారు.

60 లీటర్ల సారా స్వాధీనం

కురుపాం,జూన్5(ఆంధ్రజ్యోతి): కురుపాంలో ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. చినమేరంగి అక్రమంగా సారా తయారు చేస్తున్న వెల గాడ కిరణ్, జన్యాల కృష్ణంరాజు వద్ద 60 లీటర్లు సారా స్వాధీనం చేసుకుని 400 లీటర్లు బెల్లంఊట ధ్వసం చేసినట్లు చెప్పారు.వీరికి సారా తయారీ సామగ్రి సమకూర్చి వండిస్తున్న రోజాను అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ రాజశేఖర్,స్టేట్ టీస్క్ ఫోర్స్ మంగళగిరి సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కురుపాం,జూన్5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో 6,7,8,9 వ తరగతి, ఇంటర్ మొదటి ఏడాదిలో చేరేందుకు మిగిలిపోయిన సీట్లు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఈ నెల 24న పరీక్ష నిర్వహించి 25న ఎంపికైన జాబితాను ఇడుదల చేస్తామని తెలిపారు. 26న ధ్రువ పత్రాలు పరిశీలిస్తామని పేర్కొన్నారు.

ప్రవేశాలు ప్రారంభం

భామిని,జూన్5(ఆంధ్రజ్యోతి):ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసి పరీక్షలుఅధిక మార్కులు సాధించివిద్యార్థుల కేటగిరీ ప్రాప్తికి ఆరోతరగతిలో ప్రవేశాల ప్రక్రియ గురువారం ప్రారంభించినట్లు భామినిఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ తెలిపారు. ఒరిజనల్‌టీసీ, స్టడీ, ఆదాయ, కులధ్రువపత్రాలు,విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, తల్లి బ్యాంక్ బుక్-3 సెట్‌లు పాఠశాలకు అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం విద్యుత్ కార్యాలయం పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పణికిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. పార్వతీపురం 33 కేవీ పరిధిలోని నర్సిపురం, మేరంగి, నాగూరు సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

●భామిని,జూన్5 (ఆంధ్రజ్యోతి): కొరమ నుంచి భామిని వరకు 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ దృష్ట్యా శుక్రవారంఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరానిలుపుదలచేస్తామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

పార్వతీపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవిటిభద్రలో రేషన్ డిపో, అంగన్‌వాడీ సెంటర్లను డీఆర్‌డీఏపీడీ సుధారాణి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఏపీఎం సన్నిబాబు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సాలూరు,జూన్5(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మునిసిపల్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. గురువారం పట్టణంలోని ఓంశాంతి మందిరంలో యోగాసనాలు నిర్వహించారు.

పాఠశాలకు కిట్లు సరఫరా

భామిని, జూన్5(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి నేరుగా పాఠశాలకు సరఫరా చేస్తున్నట్టు ఎంఈవో బాస్కరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం భామినిలో పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్ ప్రాప్తికి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికి బ్యాగ్‌లు 4708, నోట్‌బుక్‌లు 26,658, షూస్ 4594, ఆరో తరగతికి 449 డిక్షనరీలు మంజూరయ్యాయని చెప్పారు. యూనిఫారాలు వచ్చిన వెంటనే సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది చిన్నబాబు, పి.కిషోర్, టి.ప్రసాదరావు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. (ఆంధ్రజ్యోతి బృందం)



సాలూరు: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు